

# సాహితీమూర్తుల సహవాసం
## – నరిశెట్టి ఇన్నయ్య



శ్రీ నరిశెట్టి ఇన్నయ్యగారు ప్రముఖ పాత్రికేయులు, రచయిత, మానవతావాది, హేతువాది. ఎంతోమంది సాహితీమూర్తులతో ఆయనకి సన్నిహిత పరిచయాలున్నాయి. ఒక్కో సాహితీమూర్తితో తన స్నేహ పరిమళాలని నెలకొకటిగా ఈ శీర్షికలో కౌముది పాఠకులతో పంచుకుంటున్నారు.

# నేను రాసిన పత్రికలు - నాకు తెలిసిన ఎడిటర్స్

## 2

## వాహిని (1936-1985)

## - స్థాపకులు - ఎన్.జి.రంగా(1900-1995)




'వాహిని' పత్రిక చరిత్రగలది. ఆచార్య రంగా రాజకీయాలతో ముడిపడి వున్న ఈ పత్రిక కొన్నిసార్లు బ్రిటిష్ పాలనలో ఆంక్షలకు గురయింది. అలాంటప్పుడు 'గో భూమి' 'క్రాంతి' అనే పత్రికలు నడిపారు.


ఆచార్య ఎన్.జి.రంగా
Achary N.G.Ranga

ఆచార్య ఎన్.జి.రంగా 1940 ప్రాంతానికే కాంగ్రెసులో రైతు నాయకుడుగా సుప్రసిద్ధ రాజకీయవాది. తన ఆశయాలకు అనుగుణంగా 'వాహిని' అనే వారపత్రికను ప్రారంభించారు. అయితే ఆయన పార్లమెంటరీ నాయకుడుగా పత్రికకు సమయం కేటాయించలేకపోయేవాడు. రంగా సాహిత్యాభిమాని. 'హరిజన నాయకుడు' అనే నవల రాశారు. అది 1930 ప్రాంతాలకే వెలువడింది. ఉన్నవ లక్ష్మీ నారాయణ రాసిన 'మాలపల్లి' కూడా అప్పుడే వచ్చింది. త్రిపురనేని రామస్వామి సాహిత్యం, ఏటుకూరి వెంకట నర్సయ్య రచనలు అభిమానంతో చదివేవారు. రైతు భజనావళిని – వివిధ కవులు రాసిన గేయాలు, 'వాహిని'లో ప్రచురించేవారు. అవి ఆనాడు రాజకీయ ప్రచారానికి కూడా తోడ్పడ్డాయి. క్రమేణా రాజకీయాల వత్తిడి వలన 'వాహిని'కి ఎడిటర్లుగా ఇతరులను నియమిస్తూ పోయారు. పార్లమెంటులో రంగా ప్రసంగాలు, బయట ఉపన్యాసాలు రైతు ఉద్యమాలకు సంబంధించిన వార్తలు 'వాహిని' ద్వారా ప్రజలకు తెలుస్తుండేవి. అయితే అది రంగా పత్రికగానే కొనసాగింది.


న్యాపతి నారాయణమూర్తి

న్యాపతి నారాయణమూర్తి (1897–1951) 'వాహిని' ఎడిటర్ గా రంగాగారి కోరికపై పనిచేశారు. నారాయణమూర్తి ఒరిస్సాలో పుట్టి కేంద్ర శాసన సభకు ఒకసారి ఎన్నికయ్యారు కూడా. 'కళింగ', 'భారతి' పత్రికలకు అనేక వ్యాసాలు రాశారు. ఆంధ్రప్రభలో ఆయన కాలం 'పాన్ –సుపారి' బహుళ జనాదరణ పొందింది. 1951లో 'విజయప్రభ'కు ఎడిటర్ గా వున్నారు.' జైభారత్' పత్రిక స్థాపించి నడిపారు. 'వాహిని' పత్రిక ఆయన సంపాదకత్వాన స్థిరంగా కొనసాగింది.


పండితారాధ్యుల

పండితారాధ్యుల నాగేశ్వరరావు (1912–1976) ఇంటూరు, గుంటూరుజిల్లాలో పుట్టి రంగాగారికి సన్నిహితుడుగా, 'వాహిని' పత్రికకు ఎడిటర్ గా పేరు తెచ్చిపెట్టారు. జర్నలిస్టుగా 'ఆంధ్రప్రభ'కు, 'ఆంధ్రపత్రిక'కు, 'ఆంధ్రభూమి'కి వివిధ దశలలో సంపాదకులుగా చేసారు. 'సంజయ' అనే దినపత్రికను హైదరాబాదు నుండి కొద్ది కాలం నడిపారు. మంచి చేయితిరిగిన జర్నలిస్టు. చిరకాలం జర్నలిస్టు జీవితం గడిపిన నాగేశ్వరరావు 'రైలుతప్పిన ప్రయాణీకులు' అనే శీర్షికన కమ్యూనిస్టులపై అతి ఘాటైన విమర్శలు చేసి బహుళ ప్రచారం పొందారు. శ్రీశ్రీ రచనలపై అనేక తీవ్ర విమర్శలు వివిధ మారుపేర్లతో చేశారు.


గోగినేని

'వాహిని' పత్రికకు ఎప్పటికప్పుడు ఎడిటర్ లు మారుతూ ఉండేవారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కె. సభా కూడా ఎడిటర్లుగా చేశారు. గోగినేని ఉమామహేశ్వరరావు కొన్నేళ్ళపాటు ఎడిటర్ గా కొనసాగారు. ఆయన గూడూరులో వుంటూ ఎక్కువగా పర్యటనలు చేస్తుండేవారు. రైల్వే బోర్డు మెంబరుగా, జాతీయ విత్తనాల సంఘ సభ్యుడుగా దేశ వ్యాప్తంగా తిరగవలసి వచ్చేది. 'రాగం, తానం, పల్లవి' అనే శీర్షిక పెట్టి వారం వారం 'వాహిని'లో రాసేవారు.

విశ్వనాథం, మనోహరం


1955 ఎన్నికల సమయంలో తాత్కాలికంగా 'వాహిని'ని దినపత్రికగా మార్చినప్పుడు బి.ఎస్.ఆర్. కృష్ణ, గద్దం విశ్వనాథం (ప్రముఖ సంఘసేవకురాలు చిత్రమనోహరం భర్త) కృష్ణాజిల్లా నందిగామ తాలూకా సుబ్బాయగూడెం వాస్తవ్యులు. ఆచార్య రంగాగారికి సన్నిహిత అనుచరులు.

పుష్కరకాలం `వాహిని` పత్రిక సంపాదక బాధ్యతను నిర్వర్తించిన ప్రముఖ రచయిత, చక్కని కథకుడు, తెలుగు పండితుడు, సాహిత్యరత్న పట్టభద్రులు. నన్నపనేని వెంకట సుబ్బయ్య, వాసిరెడ్డి సత్యనారాయణ, జాస్తి జగన్నాధంగార్లు పనిచేశారు.

1955లో ఆంధ్రలో అసెంబ్లీ ఉప ఎన్నికలు జరిగాయి. కమ్యూనిస్టులకు, ఐక్యకాంగ్రెస్ కు జరిగిన తీవ్రపోరాట రోజులవి. అందులో ఆచార్యరంగా పాత్ర గణనీయంగా ఉండేది. ఆయన పర్యటన వివరాలను, ప్రసంగాలను దరువూరి వీరయ్య `వాహిని`కి నివేదించేవారు.

చంద్రపాల్ చివరి ఎడిటర్ గా పనిచేశారు. వెల్లంకి చంద్రపాల్ ప్రభుత్వ గ్రంథాలయ సంస్థకు సేవలు చేశారు. గౌరవ సంపాదకులుగా `వాహిని`ని 1985 వరకు నడిపారు. ఆ తరువాత ఆగిపోయింది.



కె.వి.సుబ్బయ్య

కె. వి. సుబ్బయ్య `వాహిని` ఎడిటర్ గా కొన్నాళ్ళు మదరాసులోను, తరువాత విజయవాడలోను పనిచేశారు. ఆయన రచయిత, రైతు అభిమాని. మదరాసులో షనాయ్ నగర్ నుండి పత్రిక వెలువడేది. వెలగపూడి రామకృష్ణ, (ఐ.సి.ఎస్.) తన కంపెనీల ప్రకటనలు ఇచ్చి ఆర్థికంగా వాహిని పత్రికు ఆదుకునేవారు. ఆచార్య రంగా రాసిన కలం చిత్రణలు అనేకమంది రైతు నాయకుల ప్రజాసేవకుల విషయాలు తెలియడానికి తోడ్పడింది. అనేకమంది రచయితలు వాహినిలో వివిధ శీర్షికలు నిర్వహించారు.

`వాహిని`లో కొన్నేళ్ళపాటు ఆవుల గోపాలకృష్ణమూర్తి రాసిన `నా చుట్టూ ప్రపంచం` ప్రత్యేక ఆకర్షణగా ఉండేది.

1954-55లో లచ్చన్న ఇచ్చిన పిలుపు మేరకు గీతకార్మికుల సత్యాగ్రహం జరగటం అందులో మా అన్న విజయరాజకుమార్ తో సహా అనేకమంది జైలుపాలు గావడం 6 నెలల తరవాత వారు విడుదలై వచ్చి రాజమండ్రి జైలులోని వారి అనుభవాలను బహిరంగ సభల ద్వారా వెల్లడించారు. అవన్నీ నేను `వాహిని`లో రిపోర్టు చేశాను. నేను 1960 ప్రాంతాలలో కొద్దిరోజులపాటు వాహినిలో పనిచేశాను. అడపతడప వ్యాసాలు రాశాను.

దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, పసుపులేటి కోటేశ్వరరావు, రావిపాటి మహానంద, గుట్లపల్లి సుబ్బారావు `వాహిని`లో తమ రచనలు అందించారు. ఎమ్.ఎన్.రాయ్ రాసిన `రీజన్, రొమాంటిసిజమ్ రివల్యూషన్` అనే గ్రంథం నుండి `మార్క్స్ కి ముందే మార్క్సిజం` అనే శీర్షికన జాస్తి జగన్నాథం అనువాద రచనలు అందించారు. `వాహిని` పత్రికకు స్థిరంగా ఒక వ్యక్తి ఎడిటర్ గా లేకపోవడం, రంగాగారి రాజకీయాలకు అనుకూలంగా రచనలు సాగడం ప్రధానంగా కనిపించేది.

1958-59లో స్వతంత్ర పార్టీ ఆవిర్భవించింది. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా జవహర్ లాల్ నెహ్రూ నాయకత్వానికి వ్యతిరేకంగా పుట్టిన పార్టీ దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. పార్టీ అధ్యక్షులుగా ఆచార్యరంగా ఉండగా, ప్రధాన నాయకుడుగా సూత్రధారిగా రాజగోపాలాచారి ఉన్నాడు. దీనికి జయప్రకాష్ నారాయణ్ (లోక్ నాయక్), ఎం.ఆర్. మసాని, బెజవాడ రామచంద్రారెడ్డి, రత్నస్వామి, నాయకులుగా ఉన్నారు. ఆంధ్రప్రాంతంలో ప్రారంభ సమావేశాలు బాపట్లలో ప్రారంభమయి, బొబ్బిలివరకూ కొనసాగాయి, అప్పట్లో నేను రంగాకు పర్సనల్ సెక్రటరీగా ఉన్నందున నాయకులందరితో సన్నిహిత పరిచయం ఏర్పడింది. రైతులకు కాంగ్రెసు తలపెట్టిన ద్రోహాన్ని విమర్శిస్తూ, ఉపన్యాసాలు సాగాయి. బాపట్లలో జరిగిన తొలి సభలో ఆవుల గోపాలకృష్ణమూర్తి ప్రత్యేక ఆహ్వానితుడుగా వచ్చి, చేసిన ప్రసంగం ప్రత్యేకంగా రాజగోపాలాచారి మన్ననలు పొందింది. ఎజికె మాట్లాడిన తరవాత నేను మాట్లాడేదేమీ లేదని ఆయన చెప్పాడంటే అది ఎజికె ప్రతిభకు నిదర్శనమయింది. నేను ఈ సభలన్నిటిలో వేదికపై వెనకవైపు కూచుని వివరంగా నోట్సు రాసుకుని వాహినికి పంపేవాణ్ణి.

ఆ పర్యటన అంతా కూడా బెజవాడ రామచంద్రారెడ్డితోపాటు ఆయన కారులో నేను పయనించాను. మేమిద్దరం అనేక రాజకీయ, సాహిత్య అంశాలు ముచ్చటించుకున్నాము. రామచంద్రారెడ్డి నెల్లూరు మిఠాయిలు తెచ్చాడు. కానీ ఆయన దయాబెటిక్ కావటం వలన తను తినకూడదని నాకు పెడుతుండేవారు. ఆ పర్యటనలో ఒక విశేషం ఏమంటే రాజగోపాలాచారి ప్రసంగాలలో తెనిగించటానికి ఎందరో ప్రయత్నించారు. బాపట్లలో ప్రారంభమయిన ప్రసంగాలలో పసుపులేటి కోటేశ్వరరావు, ఎన్. వీరాచారి, ఎన్. విజయరాజకుమార్, కొసరాజు అమ్మయ్య, సుంకర సత్యనారాయణ, ఉషశ్రీ, ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు లచ్చన్న ప్రజలకు అందుబాటులో వుండే తీరులో రాజగోపాలాచారి ఉపన్యాసాలని తెనిగించగలిగారు. అంతటితో ఆయననే కొనసాగించమని రాజాజీ కోరారు. ఇది ఒక ప్రత్యేకమైనటువంటి విశేషం. కాకినాడలో రాజాజీతో కలిసి నేను ముచ్చటించగలిగాను. విలేఖరిగా జాగ్రత్తగా రిపోర్టు చెయ్యమని ఆయన నాకు చెప్పారు. ఎం.వి. శాస్త్రిగారి ఇంట్లో జరిగిన విందులో మేము ఇష్టాగోష్ఠి కబుర్లు చెప్పుకోగలిగాము. ఇవన్నీ ఎప్పటికప్పుడు 'వాహిని'కి రాసి పంపిస్తుండేవాడిని. ఆ విధంగా విలేఖరి పని కూడా చేశాను. చంద్రపాల్ చివరి ఎడిటర్ గా పనిచేశారు. వెల్లంకి చంద్రపాల్ ప్రభుత్వ గ్రంథాలయ సంస్థకు సేవలు చేశారు. గౌరవ సంపాదకులుగా 'వాహిని'ని 1985 వరకు నడిపారు. ఆ తరువాత ఆగిపోయింది.



బి.ఎస్.ఆర్. కృష్ణ

●●●



చంద్రపాల్



వాహిని - శ్రీ ఉమామహేశ్వరరావు

శ్రీ గోగినేని ఉమామహేశ్వరరావు

ఆచార్య రంగా

(మరో సాహితీమూర్తితో సహవాసం గురించి వచ్చే సంచికలో)●●●